క్లుప్తంగా

ట్రాక్టర్ల ర్యాలీకి సీపీఐ మద్దతు

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గురువారం రైతులు నిర్వహిస్తున్న ట్రాక్టర్ల ర్యాలీకి సీపీఐ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు మద్దతు ధర కోసం పార్లమెంట్‌లో చట్టం చేస్తామని, రైతు చట్టాలు వెనక్కి తీసుకుంటామని ప్రకటించి మళ్లీ మోసపూరితంగా నల్లచట్టలను పార్లమెంట్‌లో తీసుకురావడానికి కేంద్రం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. గురువారం నిర్వహించే ట్రాక్టర్ల ర్యాలీలో రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ర్యాలీలో ప్రతి రైతు పాల్గొనాలి

మునుగోడు : రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మునుగోడులో చేపట్టే ట్రాక్టర్ ర్యాలీలో ప్రతి రైతు పాల్గొనాలని సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను కోరారు. బుధవారం ఆయన మునుగోడులో విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేకు చట్టాలను రద్దు చేసేంత వరకు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు.

29న లారీ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం

చిట్యాల : పట్టణంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013లో ఏర్పాటైన అసోసియేషన్ కార్యవర్గానికి నేటివరకు తిరిగి ఎన్నికలు నిర్వహించలేదని, కార్యవర్గం పదేళ్లుగా కొనసాగినప్పటికీ నేటివరకు లారీ యజమానుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. అసోసియేషన్ లావాదేవీలు సభ్యులకు వివరించడం లేదని ఆరోపించారు.

29న ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ

చిట్యాల : రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో ఈ నెల 29వ తేదీన మాజీ సీఎం ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కుందారపు కృష్ణమాచారి తెలిపారు. చిట్యాలలో బుధవారం జరిగిన టీడీపీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు కొంపెల్లి అశోక్, శేపూరి సుదర్శన్, అర్రూరి సత్తయ్య పాల్గొన్నారు.

ఐసీఏఆర్ మెంబర్‌గా వీరెల్లి చంద్రశేఖర్



నల్లగొండ టూటౌన్ : ఐసీఏఆర్ సీఆర్‌ఐడీఏ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్) మెంబర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వీరెల్లి చంద్రశేఖర్‌ను నియమిస్తూ బుధవారం కేంద్ర వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలిపారు.

పుస్తకాలు, టై బెల్టులు పంపిణీ

కట్టంగూర్ : మండలంలోని గార్లబాయిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 75 మంది విద్యార్థులకు రూ.25వేల విలువ చేసే ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు, టై బెల్టులను గ్రామానికి చెందిన కంచర్ల సునిల్‌కుమార్‌రెడ్డి బుధవారం అందజేశారు. సర్పంచ్ బోడ సరిత యాదగిరి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్ జనార్దన్, హెచ్‌ఎం ఎస్ నారాయణ, ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి, నాయకులు పాల్వాయి లింగారెడ్డి, గోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన కుర్ర రామస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని బీఆర్‌ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు పిల్లి రామరాజుయాదవ్ బుధవారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

వీఓఏల ధర్నా

నాంపల్లి : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్, సీసీలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్లపురాజుపల్లి, చిట్టెంపాడు గ్రామాలకు చెందిన వీఓఏలు బుధవారం స్త్రీశక్తి భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. గతంలో పనిచేసిన సిబ్బందికి వేతనం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.

పత్తిని కొనుగోలు చేయాలి

చిట్యాల : రైతులు నిల్వ చేసుకున్న పత్తిని కొనుగోలు చేసేందుకు అధికారులు,చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల సర్వేలో భాగంగా బుధవారం తాళ్లవెల్లెంల గ్రామంలో రైతులు తమ ఇళ్లలో నిల్వచేసిన పత్తిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. పామనగుళ్ళ అచ్చాలు, ఐతరాజు నర్సింహ, జిట్ట సరోజ, నకిరేకంటి రాములు, కట్ట వెంకటేశం, కందుల అనిత, కొమ్మనపల్లి గోపాల్ పాల్గొన్నారు.

వీధుల్లోకి వెళ్లాలంటే హడల్ !

- గ్రామాల్లో పెరిగిన శునకాల సంఖ్య
- ఎదురుపడినవారిపై దాడి
- చర్యలు తీసుకోలేకపోతున్న పంచాయతీ పాలకవర్గాలు



చిట్యాలలోని ఓ వీధిలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

చిట్యాల : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది. అవి మనుషులు, పశువులు, గొర్రెలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. గతంలో కుక్కల నిర్మూలనకు గ్రామ పంచాయతీవారు చర్యలు తీసుకునేవారు. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కుక్కల నిర్మూలన చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. కుక్కల నిర్మూలనకు ఇటీవల చర్యలు తీసుకున్న జిల్లాలోని కొందరు సర్పంచ్‌లపై అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో కుక్కల జోలికి పంచాయతీ పాలకవర్గాలు వెళ్లడం లేదు.

188 మందికి కుక్కకాటు..

చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి, వట్టిమర్తి, వెలిమినేడు, గుండ్రాంపల్లి, చిన్నకాపర్తి, వనిపాకల గ్రామాలతోపాటు చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో సైతం కుక్కల బెడద ఎక్కువగా ఉంది. కుక్కలు వీధుల్లో గుంపులుగా తిరుగుతూ ఎదురుపడిన వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. చిట్యాల మండలవ్యాప్తంగా గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు 188 మంది కుక్కల దాడిలో గాయపడ్డారు. చిట్యాల పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గత మూడు నెలల్లో 108 మంది కుక్క కాటుకు గురై యాంటి రేబిస్ వాక్సినేషన్ వేయించుకున్నారు. వెలిమినేడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గత మూడు నెలల్లో 80 మంది కుక్క కాటుకు గురై యాంటి రేబిస్ వాక్సినేషన్ వేయించుకున్నారు. అంతేకాకుండా ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లి కుక్క కాటు వాక్సినేషన్ వేయించుకున్నవారు మరో వందమంది వరకు ఉంటారు.

4 గేదెలు, 9 గొర్రెల మృతి..

మండలంలోని పలు గ్రామాల్లో గత మూడు నెలల కాలంలో నాలుగు గేదెలు, తొమ్మిది గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందాయి. వెలిమినేడు గ్రామంలో రెండు గేదెలు, వట్టిమర్తి గ్రామంలో రెండు గేదెలు కుక్కల దాడికి గురై మృతి చెందాయి. వనిపాకల గ్రామంలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేసిన ఘటనలో తొమ్మిది గొర్రెలు మృతి చెందాయి. దీంతో పాడి రైతులకు, జీవాల పెంపకందారులకు వేలాది రూపాయల నష్టం వాటిల్లింది. అయినప్పటికీ పంచాయతీ పాలకవర్గాలు ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. కుక్కల నిర్మూలనకు తగిన చర్యలను తీసుకోవాలని పలువురు గ్రామస్తులు, పాడి రైతులు అధికారులను కోరుతున్నారు.

కుక్కలను నిర్మూలించాలి



మా వట్టిమర్తి గ్రామంలో దొడ్డి వద్ద ఉంచిన గేదెపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గతంలో కూడా గ్రామంలో గేదెలపై, గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే తగిన చర్యలు తీసుకుని కుక్కలను నిర్మూలించాలి. మృతి చెందిన గేదెలకు, గొర్రెలకు అధికారులు నష్ట పరిహారం చెల్లించాలి.

– నర్రా అచ్చిరెడ్డి, పాడి రైతు, వట్టిమర్తి

మునుగోడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



తేరట్‌పల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు(గట్టుప్పల) : మునుగోడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం గట్టుప్పల, చండూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో రూ.4 కోట్ల 55 లక్షల నిధులతో గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప ఎన్నిక సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేస్తూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పల్లె కళ్యాణిరవికుమార్, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, సర్పంచ్ వీరమళ్ళ శ్రీశైలం, ఎంపీటీసీ గొరిగె సత్తయ్య, అచ్చిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం విరాళం



రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న నెల్లికంటి సత్యం

మునుగోడు : నూతనంగా ఏర్పాటైన మండలంలోని ఎల్లలగూడెం గ్రామ పంచాయతీలో పంచాయతీ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం విరాళంగా అందజేశారు. ఇటీవల ప్రభుత్వం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కాగా ఆ గ్రామంలో ఎక్కడా ప్రభుత్వ భూమి లేకపోవడంతో ఆయన తన రెండు గుంటల స్థలాన్ని గ్రామ పంచాయతీ పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించి ఆ పత్రాలను బుధవారం ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురిగి చలపతి, ఉప సర్పంచ్ మేకల శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ నాయకులు తిరిపారి వెంకటేశ్వర్లు, ఈదులకంటి కైలాస్‌గౌడ్, తిరిపారి కృష్ణయ్య, కట్కూరి లింగస్వామి, సురిగి లింగస్వామి, ఈదులకంటి మంజుల, కొమురమ్మ, ఇందిరమ్మ, లింగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ, జూనియర్ కళాశాల హాస్టళ్ల తనిఖీ



చర్లపల్లిలోని గురుకుల డిగ్రీ కళాశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నల్లగొండ : చర్లపల్లిలోని గురుకుల డిగ్రీ కళాశాలను నల్లగొండ డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు, హాస్టళ్లకు ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తున్నప్పటికీ అన్నం సక్రమంగా కావడం లేదని ఆరోపణ రావడంతో ప్రభుత్వం పౌర సరఫరాల అధికారులను తనిఖీ చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో రెండు రోజుల నుంచి డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహిస్తున్నారు. బియ్యం సరఫరాలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల హాస్టల్‌ను బుధవారం సాయంత్రం డీసీఎస్‌ఓ వి.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంట చేస్తున్నారా.. లేదా అని కళాశాల ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ ద్వారా వంట చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని వార్డెన్‌ను ఆదేశించారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



పోస్టర్ విడుదల చేస్తున్న కిసాన్ సెల్ నాయకులు

మునుగోడు : రైతులను ఆదుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కిసాన్ మోర్చా రాష్ట్ర భూనిర్వాసితుల హక్కుల సెల్ కన్వీనర్ భవనం మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. రైతుల పట్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రతి రైతుకు తెలియజేసేందుకు ముద్రించిన కరపత్రాన్ని బుధవారం మునుగోడులోని బీజేపీ క్యాంపు కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అందిస్తున్న ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయడం లేదన్నారు. రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో అనేకమంది రైతులు బ్యాంకుల్లో డీఫాల్టర్లుగా మిగిలిపోయారన్నారు. ఈ విషయాలను నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి రైతుకు తెలియజేసేందుకు యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కంపె దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి బీసం శ్రీశైలం, కార్యదర్శి నీల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

రామగిరి(నల్లగొండ) : విదేశీ విద్యనభ్యసించడానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఓవర్‌సిస్ విద్యాసంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్ భవానీగణేశ్, మైనార్టీ నాయకులు అహ్మద్ కలీమ్, మౌలానా ఎసానుద్దీన్ ఖాస్మీ, మౌలానా బషీర్, మదస్సీర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కేవైసీ చేసుకోవాలి

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులు ఈ కేవైసీ చేసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆ గ్రామంలో జరిగిన ఈ కేవైసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల వరకు 1600 రోగాలకు ఉచితంగా వైద్యం అందిస్తుందని తెలిపారు. ఆరోగ్య మిత్ర బూర్గు సైదులు, నాయకులు పబ్బు వెంకన్న, జూలూరు నాగరాజు, కొత్త విజయ్‌కుమార్, కందుల సాగర్, బొమ్మగాని నాగరాజు, కంబాలపల్లి సైదులు, నీలం నాగరాజు ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న పాల్వాయి స్రవంతి

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల్ మండల కేంద్రంలో గట్టుప్పల్ ప్రీమియర్ లీగ్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాల్వాయి స్రవంతిరెడ్డి బుధవారం ఆ గ్రామ సర్పంచ్ ఇడెం రోజాతో కలిసి ప్రారంభించారు. దండు యాదగిరిరెడ్డి, ఇడెం కైలాసం, నామని బుచ్చయ్య, భీమగాని మల్లేశం, ఆది పాల్గొన్నారు.

మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్ అందజేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

చిట్యాల : మండలంలోని వనిపాకల జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రాపోలు శ్రీనివాస్ రూ.25 వేల విలువ గల వైర్‌లెస్ మైక్ సెట్‌ను బుధవారం ఆ పాఠశాలకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడి లింగమ్మ నర్సింహ, హెచ్‌ఎం దంతూరి సైదులుగౌడ్, ఎస్‌ఎంసీ చైర్మన్ బి.నర్సింహ, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, సరిత, ఇమామ్, శోభారాణి, మల్లేశం, మహాదేవి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్ : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (టీఎస్ మేసా) ముద్రించిన నూతన సంవత్సరం 2023 క్యాలెండర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అదనపు కలెక్టర్లు ఖుష్బూగుప్తా, భాస్కర్‌రావులను అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఏఏఖాన్, మహ్మద్ అబ్దుల్ అలీమ్, సయ్యద్‌అలీ, మహ్మద్‌సుఫియాన్, సర్వేజ్, హఫీజుల్లా, ఫరీదుద్దీన్, జహంగీర్, అతీక్ అహ్మద్, యూసూఫ్, జునైద్‌హాష్మీ, సయ్యద్‌జానీ బాబ, యూసూఫ్, మహ్మద్‌అలీ, అస్మా, ఫర్విన్ సుల్తానా, అన్వర్‌అలీ, రయీస్, మోయిజ్, నఫిసుద్దీన్, రాజు, మదార్, ఫరేజ్‌అస్లాన్, నరీజముద్దీన్, ఖాదర్, అబ్దుల్ గఫార్, అబ్బాస్, ఫరూక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలి

కట్టంగూర్ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ ఆడెపు నాగార్జున డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఫిబ్రవరి 12న జాతీయ రహదారి 65 పై చేపట్టే రోడ్డు దిగ్బంధనం కార్యక్రమంలో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పోలేని యాదయ్య, జిల్లా తిరుమలేష్, జీడిమల్ల రమేష్, గ్యార శ్రీనివాస్, ఊట్కూరి శ్రీనివాస్, మేడి మల్లయ్య, మునుగోటి వెంకన్న, నర్సింహ, మేడి నర్సయ్య ఉన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్జీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న నల్లగొండ మున్సిపల్ కమిషనర్ రమణాచారి



నకిరేకల్ : గొల్లగూడెం ప్రాథమిక పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీటీసీ మాదగోని ధనలక్ష్మి



చిట్యాల : యువ ఓటర్ల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్



శాలిగౌరారంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మునుగోడు : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

నల్లగొండ రూరల్ : ఓటు దేశ ప్రజాస్వామ్యానికి శక్తివంతమైన ఆయుధమని పట్టణంలోని ఉమెన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పాల్ ఘన శ్యాం అన్నారు. బుధవారం కాలేజీలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంజుల, సునిత, భాస్కర్‌రెడ్డి, రాజారాం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయించిన కమిషనర్

నల్లగొండ టూటౌన్ : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగులు, పలువురు కౌన్సిలర్లతో మున్సిపల్ కమిషనర్ కె.వీ. రమణాచారి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, డీఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో..

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని ఎన్జీ కళాశాలలో బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జాతీయ సేవల పథకం, రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జల సాధన సమితి వ్యవస్థాపకుడు దుశ్చర్ల సత్యనారాయణ పాల్గొని ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ సయ్యద్ మనీర్, రాజనీతి శాస్త్రం విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ శీలం యాదగిరి, నాగుల వేణు, యాదగిరిరెడ్డి, మల్లేశం, డాక్టర్ భాగ్యలక్ష్మీ, శివరాణి, లైబ్రేరియన్ ఏ.దుర్గాప్రసాద్, వెంపటి శ్రీనివాస్, అంతటి శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, తిరుమలేష్ పాల్గొన్నారు.

నకిరేకల్ : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం నకిరేకల్ మండలం గొల్లగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జెడ్పీటీసీ మాదగోని ధనలక్ష్మి ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. రాజనీతి శాస్త్ర విభాగం అధికారి మధుసూదన్, అధ్యాపకులు హబీబ్, శంకర్, జానయ్య, ఎంపీటీసీ బి కిశోర్, హెచ్‌ఎం గుండగోని రవిశంకర్, ఉపాధ్యాయులు కళ్యాణి, చిర్రబోయిన భిక్షం, యాదయ్య, సత్యనారాయణ, సూరి జానకిరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు

ఓటుహక్కు ప్రాధాన్యత గుర్తించాలి

కేతేపల్లి : ఓటుహక్కు ప్రాధాన్యత గుర్తించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా తమపేరు నమోదు చేయించుకోవాలని కేతేపల్లి తహసీల్దార్ డి.వెంకటేశ్వర్లు కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటు హక్కు వినియోగించుకుంటామంటూ బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉద్యోగులు, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీవో రమేష్ దీన్‌దయాళ్, డీటీ దివ్య, ఏఎస్ఓ సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి తహసీల్దార్ దేశ్యానాయక్‌ప్రతిజ్ఞ చేశారు. ఆర్ఐ కుమార్‌రెడ్డి, డీటీ సుకన్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చిట్యాల : పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని చిట్యాల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ అన్నారు. చిట్యాల పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం జరిగిన ఓటర్ల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నాయబ్ తహసీల్దార్ రాగ్యానాయక్, హెచ్‌ఎం గోగికార్ మాధవి, పీఈటీ రవీందర్, ఉపాధ్యాయులు రాధిక తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలకేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో మండల అధికారులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ రేకల లక్ష్మయ్య, ఎస్ఐ సతీష్, కరస్పాండెంట్ దంతూరి పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఓటర్లకు ముగ్గుల పోటీలు

మునుగోడు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మునుగోడు ఉన్నత పాఠశాలలో బుధవారం యువ మహిళా ఓటర్లకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేసి నూతన ఓటర్లకు ఓటు కార్డులు అందించారు. తహసీల్దార్ కృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, ఆర్.ఐ దుర్గామల్లేశ్వరి, హెచ్‌ఎం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. తహసీల్దార్ ఎల్‌బీ.శాస్త్రి, ప్రిన్సిపాల్ జి.మోహన్ రావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఏ.శిరీష, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

మర్రిగూడ : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి డిప్యూటీ తహసీల్దార్ జుతూరు తారకరామన్ ప్రతిజ్ఞ చేశారు. తమ్మడపల్లిలో నూతన ఓటర్లకు సర్పంచ్ కొట్టం మాధవిరమేష్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఆర్ఐలు బషీర్ అలీ, శేఖర్, పంచాయతీ కార్యదర్శి శిరీష, సిబ్బంది మహేష్, మధు, అరుణ, పాండు, నర్సింహ, వెంకటయ్య, లింగయ్య, రాములు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

చండూరు : మూడు నెలల పెండింగ్ వేతనాలతోపాటు 10 నెలల ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఐదోరోజు మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగించారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రతి ఆదివారం సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ మోగదాల వెంకటేష్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యక్షుడు నల్లగంటి లింగస్వామి, కార్యదర్శి కత్తుల సైదులు, కోశాధికారి నాగరాజు, ఇరిగి యాదగిరి, ధనయ్య, బొల్లంపల్లి కళమ్మ, చంద్రమ్మ, రవమ్మ, అలివేలు, ముత్తమ్మ, జంగమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పల్లెల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



భీమారంలో ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే చిరుమర్తి

కేతేపల్లి : పల్లెల సమగ్రాభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం రాత్రి వారు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. స్థానిక సర్పంచ్ బడుగుల శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జి.స్వప్న, గుడివాడ సర్పంచ్ కట్ట శ్రవణ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న, నాయకులు కొమ్ము ముత్తయ్య, బంటు మహేందర్, కొండ సైదులు తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

నల్లగొండ టూటౌన్ : రిసోర్స్ పార్కు (డంపింగ్ యార్డు)లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వీ. రమణాచారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పార్కులో వివిధ అభివృద్ధి పనులు ఆయన పరిశీలించారు. అదేవిధంగా ఎనిమల్ బర్త్ సెంటర్‌ను, పానగల్ పంప్‌హౌజ్‌ను పరిశీలించారు. రోజువారీ పనులకు సంబంధించి అన్ని వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. తడి, పొడి చెత్త నుంచి ఎరువు తయారు చేసి మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచి విక్రయిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం పంప్‌హౌజ్ వద్ద మొక్కలు నాటి నీళ్లు పోశారు.

డ్వాబ్ సంస్థకు విరాళం

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని గొల్లగూడలో ఉన్న డ్వాబ్ సంస్థకు ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగి మసురం వెంకటేశ్వర్‌రావు–సుగంధమాల దంపతులు బుధవారం రూ.లక్ష విలువ చెక్కు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు, దామోదర్‌రావు, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మసురం సుగంధమాల